క్లుప్తంగా

హోర్డింగ్స్ తొలగింపు



నెహ్రూనగర్: పట్టణ ప్రణాళిక అధికారులు బుధవారం నగరంలోని పలు ప్రాంతాల్లో ఫీజులు చెల్లించని, అనధికార హోర్డింగ్స్, బోర్డులను తొలగించారు. ఈ సందర్భంగా నగరపాలక సంస్థ కమిషనర్ కీర్తి చేకూరి మాట్లాడుతూ నగరంలో ప్రకటనల హోర్డింగ్స్ యజమానులు మీడియా డివైజ్ డిస్‌ప్లే ఫీజులు సక్రమంగా చెల్లించాలని, లేనిపక్షంలో చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రకటనల బోర్డుల నిర్వాహకులు తప్పనిసరిగా బకాయిలతో పాటుగా ప్రస్తుత ఏడాది డిమాండ్ కూడా చెల్లించాలని సూచించారు.

ఎగిరే ధిక్కార పతాకం కలేకూరి ప్రసాద్



నెహ్రూనగర్: దళిత ధిక్కార కవిగా, ప్రజా పాటల రచయితగా, దళిత విప్లవ ఉద్యమకారుడిగా, సంపాదకుడిగా నిడంబర జీవితాన్ని గడిపిన మహోన్నత వ్యక్తి కలేకూరి ప్రసాద్ అని భీమ్ భారత్ రాష్ట్ర అధ్యక్షుడు పాగళ్ల ప్రకాష్ కొనియాడారు. అరండల్‌పేటలోని సంఘ కార్యాలయంలో బుధవారం కలేకూరి ప్రసాద్ వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా ప్రకాష్ మాట్లాడుతూ కలేకూరి ప్రసాద్‌కుఅతి చిన్న వయస్సులోనే విప్లవ ఉద్యమాలకు ఆకర్షితుడై ఎన్నో పోరాటాలు చేశారని తెలిపారు. దళితులు, స్త్రీలు, బీసీలు, మైనార్టీల హక్కుల సాధన కోసం చివరి శ్వాస వరకు పోరాడిన గొప్ప ఆదర్శవాది అని కొనియాడారు.

బహుజన మహాసేన నూతన కార్యవర్గం



నెహ్రూనగర్: బహుజన మహాసేన నూతన కార్యవర్గం ఎన్నిక బుధవారం పోస్టల్ కాలనీలో సంఘ వ్యవస్థాపక అధ్యక్షుడు ఎం. వర్ధన్‌యాదవ్ అధ్యక్షతన నిర్వహించారు. సంఘ ఉమ్మడి రాష్ట్రాల గౌరవాధ్యక్షుడిగా చింతా రాంప్రసాద్, రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా పచ్చిగోళ్ల రవితేజ, రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా ఎండీ. జిలాని, రాష్ట్ర కార్యదర్శిగా ఎం. సుబ్బారావు, రాష్ట్ర ఈసీ మెంబర్‌గా పి. రంగనాథ్, గుంటూరు జిల్లా ఉపాధ్యక్షుడిగా పోట్లూరి అమర్‌నాథ్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సంఘ ఉమ్మడి రాష్ట్రాల గౌరవాధ్యక్షుడు రాంప్రసాద్ మాట్లాడుతూ అట్టడుగు వర్గాలైన ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలను ఏకం చేసి వారిని రాజ్యాధికారం దిశగా అడుగులు వేయించేందుకు బహుజన మహాసేన కృషి చేస్తుందని తెలిపారు. కార్యక్రమంలో రాష్ట్ర రజక జన సేవా సంఘ నాయకులు జూపూడి శ్రీనివాసరావు, ప్రసాద్, సాగర్ పాల్గొన్నారు.

గంజాయి విక్రయిస్తున్న ఇద్దరి అరెస్టు

గుంటూరు ఈస్ట్: గంజాయి విక్రయిస్తున్న ఇద్దరిని నగరంపాలెం పోలీసులు అరెస్టు చేశారు. రామిరెడ్డినగర్‌లో నివసించే ఒడిస్సా రాష్ట్రానికి చెందిన చిత్తరంజన్, సుగుణ, గంజాయిని ప్యాకెట్లుగా కట్టి చుట్టుగుంట రైతు బజారు సమీపంలో విక్రయిస్తున్నారు. సమాచారం అందుకున్న పోలీసులు బుధవారం దాడి చేశారు. ఇద్దరిని అదుపులోకి తీసుకుని 150 గ్రాముల గంజాయి స్వాధీనం చేసుకున్నారు.స్టేషన్‌కు తరలించి, అరెస్టు చేశారు.

19న వైద్యులకు వాక్ ఇన్ ఇంటర్వ్యూ

గుంటూరు మెడికల్: జిల్లా వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయం పరిధిలో పలు ఆరోగ్య కార్యక్రమాల్లో కాంట్రాక్టు వైద్యుల పోస్టుల భర్తీకి వాక్ ఇన్ ఇంటర్వ్యూ నిర్వహిస్తున్నట్లు డీఎంహెచ్‌వో డాక్టర్ అమర్తలూరి శ్రావణ్‌బాబు తెలిపారు. కార్డియాలజిస్ట్, జనరల్ ఫిజీషియన్, గైనకాలజిస్ట్, సైక్రియాటిస్ట్, పీడియాట్రీషన్, మెడికల్ ఆఫీసర్, సివిల్ అసిస్టెంట్ సర్జన్ ఉద్యోగాలకు ఈనెల 19న గుంటూరు డీఎంహెచ్‌వో కార్యాలయంలో వాక్ ఇన్ ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. అభ్యర్థులు ఒరిజినల్ సర్టిఫికెట్లతో పాటు ఒక సెట్ ఫొటోస్టాట్ కాపీలు తీసుకుని ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల్లోపు హాజరుకావాలని సూచించారు. విద్యార్హతలు, వేతనాలు, దరఖాస్తు ఫారాల కోసం గుంటూరు.ఏపీ.జీవోవీ.ఇన్ వెబ్‌సైట్‌ను చూడాలని వెల్లడించారు.

ఘనంగా గంగమ్మ తల్లి ఉత్సవాలు

చేబ్రోలు: మండలంలోని గుండవరంలో గంగమ్మ, రేణుకమ్మ, అంకమ్మ తల్లుల ఉత్సవాలు బుధవారం ఘనంగా నిర్వహించారు. అమ్మవార్లను కృష్ణానదికి స్నానానికి తీసుకెళ్లడం, మాత కల్యాణం తదితర కార్యక్రమాల్ని ఘనంగా నిర్వహించారు. అనంతరం అమ్మవారి ఊరేగింపులో వివిధ ప్రాంతాలకు చెందిన మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. గురువారం ముగింపు ఉత్సవాల్ని నిర్వహిస్తున్నట్లు కొలుపుల కమిటీ నేత దానబోయిన శివయ్య తెలిపారు.

ప్రజా ప్రయోజనాలే సీఎం జగన్ లక్ష్యం

ఎమ్మెల్సీ లేళ్ల అప్పిరెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ అప్పిరెడ్డి. పక్కన ఎమ్మెల్యే గిరి, ఎమ్మెల్సీ ఏసురత్నం తదితరులు

పట్నంబజారు: ప్రజా ప్రయోజనాలే లక్ష్యంగా రాష్ట్ర ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్‌మోహన్‌రెడ్డి ముందుకు సాగుతున్నారని ఎమ్మెల్సీ, వైఎస్సార్ సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి లేళ్ల అప్పిరెడ్డి పేర్కొన్నారు. నగరంలోని 19, 33, 36, 39, 45, 49, 52 డివిజన్ల సమీక్ష సమావేశాన్ని బుధవారం బృందావన్ గార్డెన్స్‌లోని ఎమ్మెల్సీ కార్యాలయంలో కార్పొరేటర్లు, కాంట్రాక్టర్లు, కార్పొరేషన్ అధికారులతో సమావేశం నిర్వహించారు. పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే మద్దాళి గిరి అధ్యక్షత వహించారు. ఆయా డివిజన్ల పరిధిలో జరుగుతున్న పనుల పురోగతి, ఇంకా చేయాల్సిన వాటి గురించి అడిగి తెలుసుకున్నారు. ఎమ్మెల్సీ అప్పిరెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన ప్రతి పనిని చిత్తశుద్ధితో నిర్వహించాలని చెప్పారు. ప్రతి ఒక్కరూ సమన్వయంతో ముందుకు సాగుతూ నగర సమగ్రాభివృద్ధికి పాటుపడాలని తెలిపారు. కార్పొరేటర్లు, కార్పొరేషన్ అధికారులు నగరాభివృద్ధికి కంకణబద్ధులు కావాలని పిలుపునిచ్చారు. అభివృద్ధి పనులు ఎక్కడా ఆగకుండా నిర్ణీత కాలవ్యవధిలో పూర్తి కావాల్సి ఉందని, అందుకు అవసరమైన కార్యాచరణను నిర్దేశించుకునేందుకు డివిజన్ల వారీగా సమావేశాలు జరుపుతున్నామని వెల్లడించారు. రాష్ట్రంలో మరే ఇతర నగరంలో కూడా లేనంత పెద్దఎత్తున గుంటూరు నగరంలో అభివృద్ధి పనులు జరుగుతున్నట్లు పేర్కొన్నారు. గత ప్రభుత్వ హయాంలో అసలు పనులే లేని దుస్థితి నుంచి ప్రస్తుతం నిధులు పుష్కలంగా అందుబాటులో ఉండటంతో అభివృద్ధికరస్థితికి గుంటూరు చేరువైందని వివరించారు. నిత్యం ప్రజల మధ్యే తిరుగుతూ తమకు ఎదురైన సమస్యల్ని కార్పొరేటర్లు అధికారుల దృష్టికి తెచ్చినప్పుడు వాటి పరిష్కారం తమ బాధ్యత అన్నట్లుగా వ్యవహరించాలని తెలిపారు. ప్రగతి పనులు నత్తనడక సాగకుండా, నాణ్యతతో సకాలంలో పూర్తి చేయాలని సూచించారు. ఎమ్మెల్యే మద్దాళి గిరి మాట్లాడుతూ తన నియోజకవర్గంలో మున్నెన్నడూ కనీవినీ ఎరుగని రీతిలో అభివృద్ధి పనులు జరుగుతున్నాయని తెలిపారు. ప్రాధాన్యత గల పనులు పెండింగ్‌లో పడకుండా టెండర్లు వేసిన వారు తక్షణమే ప్రారంభించి పూర్తి చేయాలని కాంట్రాక్టర్లను కోరారు. ఎమ్మెల్సీ చంద్రగిరి ఏసురత్నం మాట్లాడుతూ సీఎం జగన్ రాష్ట్రంలో బాధ్యతలు చేపట్టాక, రాష్ట్రవ్యాప్తంగా అభివృద్ధి పనులు జోరుగా సాగుతున్నట్లు చెప్పారు. గుంటూరులో మరింత వేగంగా ప్రగతి పనులు జరుగుతున్నాయని తెలిపారు. అస్తవ్యస్తంగా ఉన్న డ్రైనేజీ వ్యవస్థను మెరుగుపరిచేందుకు వీలుగా తొలుత అన్ని ప్రాంతాల్లో సైడు కాలువల నిర్మాణం చేపట్టాలని సూచించారు. ఎక్కడా వీధి లైటు వెలగడం లేదన్న మాటే వినబడకుండా సంబంధిత అధికారులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని కోరారు. సమావేశంలో కార్పొరేటర్లు యక్కల మారుతీ కోటిలింగారెడ్డి, ఈచంపాటి ఆచారి, బోడపాటి ఉష, కిశోర్, శ్రీవల్లి, గోపీ శ్రీనివాస్, మార్కెట్‌బాబు, యోగేశ్వరరావు, షేక్ రోషన్, అందుగుల సంతోష్, పార్టీ నగర నేతలు బందా రవీంద్రనాథ్, దుగ్గెంపూడి వెంకట్రామిరెడ్డి, ఆనం సంజీవరెడ్డి, కార్పొరేషన్ ఈఈ సుందరరామిరెడ్డి, ఏపీసీపీడీసీఎల్ ఈఈ శ్రీనివాసబాబు, కార్పొరేషన్‌డీఈఈలు రమేష్, రఫీక్, ఏఈ రాంబాబు, ఏపీసీపీడీసీఎల్ డీఈఈలు ముస్తాక్, రాయుడు, ఏఈలు కె.అక్కిరెడ్డి, ఎం.ఉదయ్‌కిరణ్, చిట్టిబాబు, అంజనేరావు పాల్గొన్నారు.

విద్యుత్ సమస్యలు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలి

ఎమ్మెల్యే ముస్తఫా



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ముస్తఫా

పట్నంబజారు: నగర ప్రజలకు విద్యుత్ సమస్యలు తలెత్తకుండా చూడాలని తూర్పు నియోజకవర్గ ఎమ్మెల్యే షేక్ మొహమ్మద్ ముస్తఫా అధికారులకు సూచించారు. బ్రహ్మానందరెడ్డి స్టేడియం సమీపంలోని ఆయన కార్యాలయంలో బుధవారం నగరపాలక సంస్థ, విద్యుత్ శాఖ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ముస్తఫా మాట్లాడుతూ వేసవి నేపథ్యంలో విద్యుత్ లోడు అధికంగా ఉన్న ప్రాంతాల్లో ఎక్కువ కెపాసిటీ ఉన్న ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేయాలని సూచించారు. స్తంభాలకు బల్బులు ఎక్కడ అవసరం చూసి తక్షణమే ఏర్పాటు చేయాలని చెప్పారు. ప్రజలకు ఇబ్బంది కలుగకుండా చూడాల్సిన బాధ్యత అధికారులపై ఉందని తెలిపారు. సిబ్బందిని ఎప్పటికప్పుడు అప్రమత్తం చేసి విద్యుత్ సమస్యకు చెక్ పెట్టాలని సూచించారు. సమావేశంలో డిప్యూటీ మేయర్ వనమా బాలవజ్రబాబు, వైఎస్సార్ సీపీ మహిళ నేత షేక్ నూరిఫాతిమా, విద్యుత్ శాఖ, నగరపాలక సంస్థ అధికారులు కోటేశ్వరరావు, శ్రీనివాసరావు, మస్తాన్, చంద్రశేఖర్, కిరణ్, కార్పొరేటర్లు, వైఎస్సార్ సీపీ ముఖ్య నేతలు పాల్గొన్నారు.

21న గుంటూరులో హైందవ ధర్మ శంఖారావం



సమావేశంలో పాల్గొన్న సదాశివరావు, రాజేష్, శ్రీనివాస్‌యాదవ్ తదితరులు

నగరంపాలెం: నగరంలో ఈనెల 21న హైందవ ధర్మ శంఖారావం నిర్వహిస్తున్నట్లు హిందూ ధర్మ దీక్షా సేవక్ ఉమ్మడి గుంటూరు జిల్లా కార్యనిర్వాహక అధ్యక్షుడు ఇక్కుర్తి సదాశివరావు తెలిపారు. అరండల్‌పేటలోని ఓ హోటల్‌లో బుధవారం శంఖారావం గోడప్రతుల్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నగరంలోని శ్రీ వాసవీ హోల్‌సేల్ క్లాత్ మార్కెట్ సమీపంలోని ఛత్రపతి శివాజీ ప్రాంగణంలో సాయంత్రం 4 గంటలకు శంఖారావం ప్రారంభమవుతుందని తెలిపారు. శ్రీ శైవక్షేత్ర పీఠాధిపతి శ్రీ శివస్వామి, పీఠాధిపతులు, స్వామీజీలు, రాష్ట్రస్థాయి ధార్మిక సంస్థల ప్రతినిధులు, పదివేల మంది భక్తులు హాజరవుతారని చెప్పారు. ఉమ్మడి గుంటూరు జిల్లాను కేంద్రంగా చేసుకుని ధర్మ ప్రచారక్ ద్వారా వివిధ ధార్మిక కార్యక్రమాలు చేపడుతున్నట్లు ఆయన తెలిపారు. భాజపా రాష్ట్ర పదాధికారి కొక్కెర శ్రీనివాస్ యాదవ్ మాట్లాడుతూ శంఖారావం పేరుతో చేపట్టిన సమ్మేళనానికి ప్రతి హిందువూ హాజరుకావాలని పిలుపునిచ్చారు. సమావేశంలో నగర అధ్యక్షుడు వై.రాజేష్, నగర ప్రచారక్ ఊరబండి కృష్ణమూర్తి, ఉపాధ్యక్షుడు జె.శ్రీనివాస్, కోశాధికారి మలిశెట్టి పవన్‌కుమార్ పాల్గొన్నారు.

జూనియర్ అసిస్టెంట్‌గా ఎంపికైన గోపీకి సన్మానం



గోపి దంపతులను సన్మానిస్తున్న ఎంపీడీవో, ఎంపీపీ, జెడ్పీటీసీ సభ్యురాలు, అధికారులు

కాకుమాను: ప్రభుత్వ కార్యాలయాల్లో చిన్నచిన్న ఉద్యోగాలు చేసే వారంతా గోపీని ఆదర్శంగా తీసుకోవాలని ఎంపీడీవో డి.శరత్‌బాబు చెప్పారు. మండలంలోని చినలింగాయపాలెం పంచాయతీ కార్యదర్శి వేల్పూరి గోపి దంపతుల్ని బుధవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో అభినందించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ గత డిసెంబర్‌లో హైకోర్టు ఆధ్వర్యంలో జూనియర్ అసిస్టెంట్ల పోస్టుల భర్తీకి నిర్వహించిన పరీక్షల్లో గోపీ ఉత్తీర్ణత సాధించి, చిలకలూరిపేట ప్రిన్సిపల్ జూనియర్ జడ్జి కోర్టులో జూనియర్ అసిస్టెంట్‌గా నియమితులైనట్లు తెలిపారు. ఉన్నత చదువులు చదివిన ప్రతి చిరుద్యోగి మంచి ఉద్యోగాలు సాధించే విధంగా ప్రయత్నం చేయాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో వ్యవసాయ సలహా మండలి జిల్లా చైర్మన్ నల్లమోతు శివరామకృష్ణ, జెడ్పీటీసీ సభ్యురాలు ముజావర్ షేక్ గుల్జార్ బేగం, ఎంపీపీ రామినేని శ్రీనివాసరావు, ప్రజా ప్రతినిధులు, వివిధ శాఖల అధికారులు, పంచాయతీ, గ్రామ సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పంటలకు విలువ జోడింపుతోనే రైతుకు ఆదాయం

ఆప్కాబ్ మేనేజింగ్ డైరెక్టర్ శ్రీనాథ్‌రెడ్డి



సేంద్రియ ఎరువుల తయారీ విధానాలను తెలుసుకుంటున్న శ్రీనాథ్‌రెడ్డి

గుంటూరు రూరల్ (వట్టిచెరుకూరు): రైతులు పండించిన పంటల్ని నేరుగా విక్రయించకుండా వాటికి విలువలు జోడించి అమ్ముకోవడం వల్ల అధిక ఆదాయం పొందవచ్చని ఆప్కాబ్ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ ఆర్. శ్రీనాథ్‌రెడ్డి సూచించారు. వట్టిచెరుకూరు మండలం పుల్లడిగుంటలోని రైతునేస్తం ఫౌండేషన్‌ను ఆయన బృందంతో కలసి సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రైతులు ఏక పంటలు కాకుండా మిశ్రమ పంటల్ని సాగు చేసుకోవడం ద్వారా మంచి ఆదాయం పొందవచ్చని తెలిపారు. వ్యవసాయంతో పాటు పశువులు, కోళ్లు, గొర్రెలు, మేకల పెంపకం చేపట్టినట్లయితే అధిక ఆదాయంతో పాటు భూమికి కావలసిన సేంద్రియ పదార్థాన్ని పొందవచ్చని సూచించారు. రసాయనాలు వాడకుండా సహజ సిద్ధమైన సేంద్రియ ఎరువుల్ని ఉపయోగించినట్లయితే భూమి ఆరోగ్యంతో పాటు ప్రజలకు మంచి ఉత్పత్తుల్ని అందించవచ్చని చెప్పారు. రైతులకు చిన్నచిన్న ఫుడ్ ప్రాసెసింగ్ యంత్ర పరికరాలకు రుణాల్ని ఆప్కాబ్ ద్వారా అందిస్తున్నట్లు పేర్కొన్నారు. అనంతరం సేంద్రియ సాగుకు సంబంధించిన వివిధ కషాయాలు, ద్రావణాలు, సేంద్రియ పద్ధతిలో సాగు చేస్తున్న వివిధ రకాల పంటల్ని ప్రత్యక్షంగా తిలకించారు. చిరుధాన్యాల ప్రాసెసింగ్ యంత్రాలు, వంటకాలు తయారుచేసే విధానాల్ని ప్రత్యక్షంగా పరిశీలించారు. రైతులకు, నిరుద్యోగులకు రైతునేస్తం ఫౌండేషన్ అందించే సేవల్ని అభినందించారు. కార్యక్రమంలో ఆప్కాబ్ అధికారులు, రైతునేస్తం ఫౌండేషన్ చైర్మన్ వై.వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

షార్ట్ సర్క్యూట్‌తో పూరిల్లు దగ్ధం

జడవల్లి(చేబ్రోలు): విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో జరిగిన అగ్ని ప్రమాదంలో పూరిల్లు దగ్ధమైన సంఘటన పొన్నూరు మండలం జడవల్లిలో బుధవారం జరిగింది. గ్రామానికి చెందిన గూడూరి సురేష్‌బాబు పూరిల్లు విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా పూర్తిగా దగ్ధమైంది. ఈ ప్రమాదంలో ఇంటిలోని దుస్తులు, సామగ్రితో పాటు పలు ధ్రువీకరణ పత్రాలు కాలిబూడిదయ్యాయి. నిరుపేద కుటుంబానికి చెందిన సురేష్‌బాబు కట్టుబట్టలతో మిగిలాడు. గ్రామ సర్పంచ్ ఇందిరా ప్రియదర్శిని నిత్యావసర వస్తువుల్ని అందించారు. పొన్నూరు అగ్నిమాపక సిబ్బంది మంటల్ని అదుపు చేశారు.

టెన్త్ ప్రతిభావంతులకు మాస్టర్ మైండ్స్ పురస్కారాలు



సమావేశంలో మట్టుపల్లి మోహన్

గుంటూరు ఎడ్యుకేషన్: గత ఏప్రిల్‌లో జరిగిన పదో తరగతి పబ్లిక్ పరీక్షా ఫలితాల్లో ప్రతిభావంతులుగా నిలిచిన విద్యార్థులకు ఈనెల 21న పురస్కారాల్ని అందజేయనున్నట్లు మాస్టర్ మైండ్స్ విద్యాసంస్థల అడ్మిన్ అడ్వైజర్ మట్టుపల్లి మోహన్ తెలిపారు. బ్రాడీపేటలోని సంస్థ కార్యాలయంలో బుధవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. టెన్త్ స్టేట్, ఐసీఎస్ఈ సిలబస్‌లలో 550కి పైగా మార్కులు సాధించిన విద్యార్థులతో పాటు సీబీఎస్ఈ సిలబస్‌లో 450కి పైగా మార్కుల్ని సాధించిన విద్యార్థులను సత్కరించి, వారిని ప్రోత్సహించాలనే ఉద్దేశంతో ప్రతిభా పురస్కారాలు అనే కార్యక్రమాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఆదివారం సాయంత్రం 5.00 గంటలకు బ్రాడీపేట 3/7లోని పవన పుత్ర క్యాంపస్‌లో జరిగే కార్యక్రమానికి హాజరుకాగోరు విద్యార్థులు ఆధార్, స్కూల్ గుర్తింపు కార్డు, టెన్త్ మార్కుల జాబితా ఇంటర్నెట్ కాపీ తీసుకుని రావాలని సూచించారు. విద్యార్థులకు ప్రతిభా పురస్కారాల సర్టిఫికెట్‌తో పాటు జ్ఞాపిక, నగదు బహుమతి అందజేస్తామని తెలిపారు. కార్యక్రమానికి అధిక సంఖ్యలో విద్యార్థులు, వారి తల్లిదండ్రులు హాజరు కావాలని ఆయన కోరారు. ఇతర వివరాలకు 92487 22218, 89781 80847 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

వ్యక్తిపై దాడి

గుంటూరు ఈస్ట్: వ్యక్తిపై ఇద్దరు దాడి చేసిన ఘటనపై పట్టాభిపురం పోలీసులు కేసు నమోదు చేశారు. విజయపురి కాలనీకి చెందిన ఏజండ్ల మారుతీ ఇటీవల స్థలాన్ని కొనుగోలు చేశాడు. మధ్యవర్తిగా ఉన్న అలి, సుబ్బారావు కమిషన్ విషయంలో గొడవ పడ్డారు. బుధవారం ఇద్దరు అతడి ఇంటికి వెళ్లి దాడి చేశారు. మారుతి భార్య అడ్డు వస్తే ఆమెను దుర్భాషలాడారు. దంపతుల్ని చంపుతామని బెదిరించారు. బాధితుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మామపై అల్లుడు దాడి

కుటుంబ కలహాల నేపథ్యంలో అల్లుడు మామపై దాడి చేసిన ఘటనపై పట్టాభిపురం పోలీసులు కేసు నమోదు చేశారు. అశోక్‌నగర్‌లో నివసించే హనుమంతరావును అదే ఇంట్లో ఉంటున్న అల్లుడు నగేష్ కుటుంబ కలహాల నేపథ్యంలో దాడి చేసి గాయపరిచాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు పోలీసులు బుధవారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

చికిత్స పొందుతూ వృద్ధుడి మృతి

మద్యానికి బానిసై ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందిన ఘటనపై నగరంపాలెం పోలీసులు కేసు నమోదు చేశారు. ఏటీ అగ్రహారం 12వ లైనులో నివసించే సాయిబాబు (56) మద్యానికి బానిసై తీవ్ర అనారోగ్యానికి గురయ్యాడు. ఈనెల 9న మద్యం మత్తులో కిందపడడంతో గాయపడ్డాడు. భార్య భూలక్ష్మి చికిత్స కోసం జీజీహెచ్‌కు తరలించింది. చికిత్స పొందుతూ బుధవారం సాయిబాబు మృతి చెందాడు. మృతదేహాన్ని మార్చురీకి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

విత్తన గుళికలతో పలు ఉపయోగాలు



పెదనందిపాడు: ప్రకృతి వ్యవసాయ విధానంలో విత్తన గుళికలు తయారు చేసుకోవడం వల్ల పలు ఉపయోగాలు ఉన్నాయని ప్రకృతి వ్యవసాయం మండల రిసోర్స్ పర్సన్ చింతా వరప్రసాద్ తెలిపారు. విత్తన గుళికలు తయారు చేసే విధానం గురించి బుధవారం సాయంత్రం మండల పరిధిలోని రావిపాడు, గొరిజవోలుగుంటపాలెం గ్రామాలలో రైతులకు అవగాహన కల్పించారు. వరప్రసాద్ మాట్లాడుతూ విత్తన గుళికలు పురుగులు పట్టకుండా, చీమలు, పక్షులు తినకుండా భూమిలో ఉండి వర్షం పడిన వెంటనే మొలకలు ఎత్తుతాయని తెలిపారు. మొలకెత్తిన తర్వాత 45 రోజులకు భూమిలో కలియదున్నడం వల్ల భూమికి మంచి పోషకాలు లభిస్తాయని, తద్వారా దిగుబడులు ఎక్కువగా సాధించవచ్చని సూచించారు. విత్తన గుళికలు రైతుభరోసా కేంద్రాలో ఉన్నాయని చెప్పారు. కార్యక్రమంలో ఆయా గ్రామాల రైతులు పాల్గొన్నారు.

దివ్యాంగులకు మూడు చక్రాల వాహనాలు పంపిణీ



వాహనాలు అందజేస్తున్న ఎమ్మెల్యే గిరి, ఎమ్మెల్సీ ఏసురత్నం తదితరులు

పట్నంబజారు: దివ్యాంగులకు రాష్ట్ర ప్రభుత్వం అండగా ఉంటుందని పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే మద్దాళి గిరిధర్, ఎమ్మెల్సీ చంద్రగిరి ఏసురత్నం తెలిపారు. బృందావన్ గార్డెన్స్‌లోని ఎమ్మెల్యే కార్యాలయంలో బుధవారం 10మంది దివ్యాంగులకు మూడు చక్రాల మోటార్ వాహనాల్ని పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గిరి మాట్లాడుతూ దివ్యాంగులకు వాహనాలు ఎంతో అవసరమని గుర్తించి రాష్ట్ర ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్ మోహన్‌రెడ్డి అందజేస్తున్నారని చెప్పారు. ప్రతి నెలా పింఛన్ అందజేసి ఆసరాగా నిలుస్తున్నారని తెలిపారు. ఎమ్మెల్యే ఏసురత్నం మాట్లాడుతూ గతంలో దివ్యాంగుల వాహనాలకు 70శాతం లబ్ధిదారులే చెల్లించాల్సి ఉండేదని, సీఎం జగన్ మానవత్వంతో వంద శాతం సబ్సిడీతో అందజేస్తున్నారని చెప్పారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నేతలు, కార్పొరేటర్లు, పలు కార్పొరేషన్ల డైరెక్టర్లు పాల్గొన్నారు.

'స్వచ్ఛ గుంటూరు'లో భాగస్వాములు కావాలి



చెత్త సేకరణను పరిశీలిస్తున్న ఎంహెచ్‌వో భానుప్రకాష్

నెహ్రూనగర్: 'స్వచ్ఛ గుంటూరు'లో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని ప్రజారోగ్య అధికారి (ఎంహెచ్‌వో) డాక్టర్ భానుప్రకాష్ తెలిపారు. ఆయన బుధవారం ఎస్ఎస్ సోమ శేఖర్, అధికారులు, కార్యదర్శులతో కలసి బృందావన్ గార్డెన్స్, రాజేంద్రనగర్‌లోని పలు ప్రాంతాల్లో పర్యటించారు. ఇంటింటి చెత్త సేకరణ, తడి పొడి విభజన తదితర అంశాల్ని పరిశీలించారు. ప్రజలకు స్వచ్ఛ సర్వేక్షణ్‌పై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎంహెచ్‌వో మాట్లాడుతూ నగరంలో ఇంటింటి చెత్త సేకరణ నూరు శాతం జరిగేలా సచివాలయాల వారీగా శానిటేషన్ కార్యదర్శులు పర్యవేక్షణ చేయాలని తెలిపారు. ప్రధానంగా ఎక్కడా చెత్త పాయింట్లు ఉండటానికి వీల్లేదని స్పష్టం చేశారు. నగర ప్రజలు కూడా వ్యర్థాల్ని తడిపొడిగా విభజన చేసి ప్రజారోగ్య కార్మికులకు అందించాలని ఆయన సూచించారు. రోడ్ల మీద, కాల్వల్లో వ్యర్థాలు వేయడం వల్ల పరిసరాల అపరిశుభ్రంతో పాటు ప్రజారోగ్యం కూడా ప్రమాదంలో పడుతుందని తెలిపారు. ప్రతి వ్యాపార వాణిజ్య సంస్థ తప్పనిసరిగా డస్ట్‌బిన్లు ఏర్పాటు చేసుకోవాలని, లేనిపక్షంలో చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

పాటిబండ్ల సీతారామయ్య స్కూల్‌కు ఐఎస్‌వో సర్టిఫికెట్



ఐఎస్‌వో సర్టిఫికెట్ అందుకున్న యలమంచిలి శివాజీ, విష్ణువర్ధన్

గుంటూరు ఎడ్యుకేషన్: నగరంలోని శ్రీ పాటిబండ్ల సీతారామయ్య సీబీఎస్ఈ పాఠశాల ఐఎస్‌వో ధ్రువీకరణ పొందినట్లు ఆ పాఠశాల గౌరవాధ్యక్షుడు డాక్టర్ యలమంచిలి శివాజీ, కరస్పాండెంట్ పాటిబండ్ల విష్ణువర్ధన్ చెప్పారు. లక్ష్మీపురం మెయిన్ రోడ్డులోని పాఠశాలలో బుధవారం జరిగిన కార్యక్రమంలో లండన్‌కు చెందిన క్వాలిటీ వెరిటాస్ సర్టిఫికేషన్ లిమిటెడ్ ధ్రువీకరించిన ఐఎస్‌వో 21001:2018 మేనేజ్‌మెంట్ సిస్టమ్స్ ఫర్ ఎడ్యుకేషన్ ఆర్గనైజేషన్ పత్రాన్ని సంస్థ ప్రతినిధుల నుంచి అందుకున్నారు. ఈ సందర్భంగా విష్ణువర్ధన్ మాట్లాడుతూ విద్యను వ్యాపార వస్తువుగా కాకుండా విలువలతో సమాజానికి అందించాలనే ధ్యేయంతో 1962లో స్థాపించబడిన శ్రీ పాటిబండ్ల సీతారామయ్య పాఠశాల రాష్ట్రంలోనే కాకుండా జాతీయస్థాయిలో పేరు, ప్రఖ్యాతుల్ని సాధించిందని తెలిపారు. సీబీఎస్ఈ కరిక్యులంతో విద్యార్థుల సమగ్రాభివృద్ధికి సంపూర్ణమైన విద్యను అందిస్తున్నందుకు గుర్తింపుగా ఐఎస్‌వో ధ్రువీకరణ పొందినట్లు చెప్పారు. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లో ఈ గుర్తింపు పొందిన ఏకైక పాఠశాల తమదే కావడం గర్వకారణమని పేర్కొన్నారు. కార్యక్రమంలో పాఠశాల పాలకవర్గ సభ్యుడు గింజుపల్లి వరప్రసాదరావు, అకడమిక్ డైరెక్టర్ లేళ్ల కృష్ణవేణి, ప్రిన్సిపాల్ జంపది పద్మజ, బోధన, బోధనేతర సిబ్బంది పాల్గొన్నారు.

ఆశ్రమానికి నిత్యావసర సరుకుల వితరణ



సరుకులు అందజేస్తున్న మానవత స్వచ్ఛంద సేవా సంస్థ సభ్యులు

గుంటూరు రూరల్: ఆపదలో ఉన్నవారిని ఆదుకునేందుకు ప్రతి ఒక్కరూ ముందుకు రావాలని మానవత స్వచ్ఛంద సేవా సంస్థ అధ్యక్షుడు నల్లమోతు రామారావు కోరారు. నగర శివారు గోరంట్లలోని కార్మెల్ విభిన్న ప్రతిభావంతులు, మానసిక వికలాంగుల ఆశ్రమానికి నెల రోజులకు సరిపడా నిత్యావసర సరుకులు బియ్యం, కూరగాయలు, పప్పులు, నూనె తదితర వస్తువుల్ని సంస్థ ఆధ్వర్యంలో బుధవారం అందజేశారు. ఈ సందర్భంగా రామారావు సంస్థ సభ్యుడు జలీల్ అహ్మద్ పేదలకు సాయం చేసేందుకు ముందుకు వచ్చి నిత్యావసర సరుకులు అందజేసినందుకు అభినందించారు. కార్యక్రమంలో సంస్థ కార్యదర్శి రమణబాబు, రమణ పాల్గొన్నారు.

ప్రాంగణ ఎంపికల్లో చలపతి ఫార్మసీ విద్యార్థుల ప్రతిభ



నాట్కో సంస్థ ప్రతినిధులతో కళాశాల యాజమాన్యం

గుంటూరు రూరల్: ప్రతి విద్యార్థికి నాణ్యమైన విద్యతోపాటు ఉజ్వల భవిష్యత్తును అందించేందుకు తమ కళాశాల ఎప్పుడూ ముందుంటుందని చలపతి ఫార్మసీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ నాదెండ్ల రామారావు తెలిపారు. నగర శివారుల్లోని లాం నందున్న కళాశాలలో బుధవారం నాట్కో ఫార్మా కంపెనీ ఆధ్వర్యంలో ప్రాంగణ ఎంపికలు నిర్వ హించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మా ట్లాడుతూ పేరెన్నికగన్న నాట్కో ఫార్మా సంస్థ నిర్వహించిన ప్రాంగణ ఎంపికల్లో తమ కళాశాలకు చెందిన 30 మంది ఉద్యోగాలకు అర్హత సాధించారని తెలిపారు. ఉద్యోగాలకు ఎంపికైన విద్యార్థుల్ని సంస్థ హెచ్‌ఆర్ డాక్టర్ పి. రంజిత్, జగన్మోహన్, వి. రామకృష్ణ, ప్రొడక్షన్ హెడ్ ఎ.వి. శ్రీనివాసరెడ్డి, చలపతి విద్యాసంస్థల అధినేత వై. వి. ఆంజనేయులు ప్రత్యేకంగా అభినందించారు.

చలపతి ఇంజినీరింగ్ అధ్యాపకుడికి డాక్టరేట్



నాగభూషణం

గుంటూరు రూరల్: లాంలోని చలపతి ఇంజినీరింగ్ కాలేజీ అసిస్టెంట్ ప్రొఫెసర్ దారం నాగభూషణానికి కోనేరు లక్ష్మయ్య డీమ్డ్ యూనివర్సిటీ పీహెచ్‌డీ ప్రదానం చేసింది.ఆయన 'ఎన్‌హాన్స్‌మెంట్ ఆఫ్ వైర్ లెస్ మెష్ నెట్‌వర్క్ పర్‌ఫార్‌మెన్స్ యూసింగ్ బయోఇన్‌స్పైడ్ అల్గారిథమ్స్' అనే అంశంపై డాక్టర్ గోరవర్ధని, డాక్టర్ కె.ఎస్.ఎస్. మూర్తి పర్యవేక్షణలో పరిశోధన చేశారు. ఈ సందర్భంగా కళాశాలలో బుధవారం జరిగిన కార్యక్రమంలో నాగభూషణాన్ని ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం. చంద్రశేఖర్, కళాశాల సెక్రటరీ కరస్పాండెంట్ వై. సుజిత్, చలపతి విద్యాసంస్థల అధినేత వై.వి. ఆంజనేయులు, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ కె. కిరణ్‌కుమార్, డాక్టర్ కె.వి. రామారావు అభినందించారు.

పచ్చిరొట్ట విత్తనాలు సిద్ధం

పెదకాకాని: రైతు భరోసా కేంద్రంలో పచ్చిరొట్ట విత్తనాలు పంపిణీకి సిద్ధంగా ఉన్నాయని వెనిగండ్ల విలేజ్ అగ్రికల్చర్ అసిస్టెంట్ పవన్‌కుమార్ తెలిపారు. పచ్చిరొట్ట విత్తనాలైన జీలుగ, పిల్లిపెసర సాగు చేయడం ద్వారా భూమిలో కార్బన్ శాతం, తేమ నిలుపుకోగల శక్తి పెరిగి, నీటి అవసరం తక్కువగా ఉంటుందని సూచించారు. రసాయన ఎరువులు కూడా అధిక మోతాదులో వాడాల్సిన అవసరం ఉండదని తెలిపారు. ప్రభుత్వం సబ్సిడీపై అందిస్తున్న పచ్చిరొట్ట విత్తనాల్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు.